క్లుప్తంగా

సబ్ జైలులో వైద్య శిబిరం



ఈసీజీ చేస్తున్న వైద్యులు

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలులో శనివారం జైలు అధికారుల ఆధ్వర్యంలో సవీరా ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఏడీజే శ్రీహరి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ తదితరులు జైలు అధికారులు, సిబ్బంది, ఖైదీలను పరీక్షించారు. ఈసీజీ , 2డీ ఎకో, రక్త పరీక్ష, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్, న్యాయవాది కుమార్, జూనియర్ అక్కినేని విజయకుమార్, కోర్టు సిబ్బంది సాదిక్, సామాజిక కార్యకర్త నజీర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం స్వాతి, మైత్రి మహిళా సంఘాల సభ్యులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ న్యాయవాదులు వెంకటేశులు, నాగేషు, క్రిష్ణారెడ్డి, బడేసాబ్ తదితరులు గృహహింస, మానవ అక్రమ రవాణా, ఫోక్సో, లైంగిక వేధింపులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. మైత్రి సంఘం పీడీ నూర్జహాన్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం చేస్తున్న మహిళలు

తాడిపత్రి అర్బన్: లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాన్ని ఏడో వారం పట్టణంలోని చింతల వేంకటరమణస్వామి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ ఆది దేవతలు లక్ష్మీ సహిత చింతల వేంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఏడు శనివారాల వత్రాన్ని ప్రారంభించారు. వత్రంలో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


హిందువులపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్ఎస్, బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు

తాడిపత్రి అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అరాచకాలను వెంటనే అరికట్టాలని ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పి, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం పట్టణంలో విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలసి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీని చేపట్టారు. వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన మారణకాండ సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గంగాధర్ యాదవ్, ఎం.ఆంజనేయులు, రాధాకృష్ణ, శ్రీరంగయ్య, నరసింహారెడ్డి, శేషఫణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు వృథా చేయొద్దు



ఎ.కొండాపురం రెగ్యులేటర్ వద్ద వృథా అవుతున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు: వర్షపునీరు వృథా కాకుండా కాలువల ద్వారా చెరువులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. శనివారం మండలంలోని ఎ.కొండాపురం గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు ఎ.కొండాపురం రెగ్యులేటర్ వద్ద వృథాగా వెళ్తున్నట్లు గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని చెరువులకు నీరు సరఫరా కావడానికి కాలువలపై పడ్డ గండ్లు పూడ్చాలన్నారు. అలాగే శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎ.కొండాపురం పాఠశాలలోకి నీరు చేరి పుస్తకాలు, రికార్డులు తడిసిపోవడంతో ప్రభుత్వ భవనంలో విద్యార్థులకు తరగతులను నిర్వహించాలన్నారు. అనంతరం వర్షం వల్ల ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయిన కుటుంబాలకు ఆమె రేషన్ సరకులు అందించారు. వర్షానికి నష్టపోయిన వారిని గుర్తించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శేషారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

వర్షపాతం వివరాలు ఇలా	
మండలం	మిల్లీమీటర్లు
తాడిపత్రి	58.4
గుత్తి	60.6
పుట్లూరు	138
యల్లనూరు	56.8
శింగనమల	85
పామిడి	69.4
గుంతకల్లు	6.2

- జలమయమైన పలు కాలనీలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానది



తాడిపత్రి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నానది



పుట్లూరు మండలం కడవకల్లు సమీపంలో ప్రవహిస్తున్న జాజికొండ వాగు

తాడిపత్రి రూరల్/గుత్తి/పుట్లూరు/యల్లనూరు/శింగనమల/పామిడి: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలకు తాడపత్రి పట్టణ సమీపంలోని ఆర్డీటీ కాలనీ జలమయమైంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో తాడిపత్రి- పుట్లూరు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా వర్షపు నీటి నుంచి వస్తువులను రక్షించడానికి కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడ్డారు. కరెంట్ లేక పోవడంతో అవస్థలు పడ్డారు. ఉదయం తడిసిన సరుకులను ఎండబెట్టుకున్నారు. అలాగే కోమలి వంక రోడ్డుపైకి వర్షపు నీటితో ప్రవహించడంతో తాడిపత్రి- పెద్దపప్పూరు రహదారి మునిగిపోయి వాహనాల రాకపోకలు స్తంభించాయి. అలాగే ఎగువ కురిసిన వర్షాల వల్ల పెన్నానదికి జలకళ వచ్చింది. దీంతో పట్టణ వాసులతోపాటు పట్టణ సమీపంలోని కడపస్లాబ్ యునిట్లు, గ్రానైట్ యునిట్లు యజమానులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- గుత్తిలో భారీ వర్షానికి లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానం, ఎల్ఎం ఎయిడెడ్ పాఠశాల ఆవరణం కుంటను తలపిస్తున్నాయి. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.
- పుట్లూరు మండలంలో భారీ వర్షానికి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు వర్షపు నీరు చేరింది. ఏ.కొండాపురం రెగ్యులేటర్ నుంచి కాలువ ద్వారా పుట్లూరు చెరువుకు నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నప్పటికీ కాలువలకు పడ్డ గండ్ల వల్ల వర్షపు నీరు వృథా అయింది. ఎఏ.కొండాపురం గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.
- యల్లనూరు మండలవ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వేములపల్లి, నిట్టూరు, మేడికుర్తి, యల్లనూరు చిత్రావతి నది, తిమ్మంపల్లి తదితర ప్రాంతాల్లో వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిమ్మంపల్లి ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరడంతో.. తహసీల్దారు నాగరాజు కాలనీని పరిశీలించారు. చిత్రావతి నదిలోకి వరద నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.
- శింగనమల మండలం భారీ వర్షం కురిసింది. గుమ్మేపల్లిలో రైతు సుదర్శన సాగు చేసిన కాకర పంట దెబ్బ తినడంతో, దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది.
- పామిడిలో శుక్రవారం రాత్రంతా వర్షం దంచి కొట్టింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



తాడిపత్రిలో జలమయమైన ఆర్డీటీ కాలనీ



యాడికి మండలం నిట్టూరు వద్ద ప్రవహిస్తున్న వంక



తాడిపత్రిలో ఇంట్లోకి ప్రవేశించిన వర్షపు నీరు

నీట మునిగిన పంట పొలాలు



నీట మునిగిన వేరుశనగ

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి దాదాపు 300 ఎకరాల్లో పంట నీట మునిగింది. వర్షం కారణంగా కొండ ప్రాంతంలోని వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో వేరుశెనగ, కంది, మొక్కజొన్న పంటలు నీట మునిగినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నరసాపురం గ్రామంలో ఉపసర్పంచ్ సుధాకర్ ఇంటి పైకప్పు కూలింది. ఈ ఘటనలో వంట సామగ్రి, ఆహార ధాన్యాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని బాధితుడు వాపోయాడు.



గుత్తిలో కుంటను తలపిస్తున్న ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానం



గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు



శింగనమల మండలం గుమ్మేపల్లిలో నేలకొరిగిన కాకర పంట



యల్లనూరు మండలం వేములపల్లిలో చెక్‌డ్యాం వద్ద పరవళ్లుతొక్కుతున్న వరద

పౌష్టికాహారం సక్రమంగా అందించండి



గర్భిణులకు సీమంతం చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

బుక్కరాయసముద్రం: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లీ బిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశు మరణాల నియంత్రణపై, చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ఉమా శంకరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు సోదరభావంతో మెలగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రభవ-2024 స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ గురుసిద్దప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

పామిడి: మండలంలోని రామగిరి గ్రామంలో దాడులు ప్రతిదాడులకు పాల్పడిన పెద్ద హరికృష్ణ వర్గంతో పాటు వడ్డే ఎల్లారెడ్డి, ఏకుల ఆదినారాయణ వర్గీయులకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. చిన్న పిల్లల వివాదంలో ఇరుగు పొరుగు వారైన వడ్డే హరికృష్ణ, వడ్డే ఎల్లారెడ్డి భార్య రుద్రమ్మ మధ్య తగాదా నెలకొంది. ఈ తగాదాలో రుద్రమ్మ పట్ల హరికష్ణ అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో రుద్రమ్మ, ఆమె తరపున ఏకుల ఆదినారాయణ వర్గీయులు పెద్ద హరికృష్ణ, ఆయన భార్య లక్ష్మి, తమ్ముడు చిన్న హరిపై కట్టెలతో దాడిచేశారు. దీంతో పెద్ద హరికృష్ణకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. హరికృష్ణను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఈ తగాదాకు సంబంధించి ఆదినారాయణ, ఆయన కుమారుడు ఎర్రిస్వామి, తమ్ముడి కుమారులు నరేష్, బాబు, రాము, రుద్రమ్మతోపాటు బాధిత పెద్ద హరికృష్ణ, లక్ష్మి, చిన్న హరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్నదాన సత్రానికి సామగ్రి వితరణ

గుంతకల్లు రూరల్: తాడిపత్రికి చెందిన సురేష్ కుమార్‌రెడ్డి అనే భక్తుడు శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం అన్నదాన సత్రానికి రూ.3.45 లక్షల సామగ్రిని అందజేశాడు. నిత్యాన్నదాన సత్రం నిర్వహణలో భాగంగా నాలుగు డబుల్ గ్యాస్ స్టవ్‌లు, స్టీల్ బేసిన్లు, సిల్వర్ బేసిన్లు ఇతరత్రా వంట పాత్రలను ఆయన విరాళంగా అందజేశారు. అలాగే బుక్కరాయసముద్రం మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన కె.హనుమంతరెడ్డి, అంజలి దంపతులు నెట్టికంటి ఆంజనేయస్వామికి రూ.1.70 లక్షల విలువగల బంగారు కన్నును విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సజావుగా ఎస్ఎంసీ ఎన్నికలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. ఎంఈఓ చంద్రనాయక్ మాట్లాడుతూ ఈ నెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించగా.. కోరం లేక పోవడంతో ఎన్నిక వాయిదా వేశామన్నారు. శనివారం ఎన్నికలు నిర్వహించగా చైర్మన్‌గా ఎర్రిస్వామి, వైస్ చైర్మన్‌గా మల్లేశ్వరి ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారదాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా

పామిడి: మండలంలోని గజరాంపల్లి ప్రాథమిక పాఠశాల, ఖాదర్‌పేట జెడ్పీహైస్కూల్లో కోరం లేక పోవడంతో రెండో సారి ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. గజరాంపల్లిలో 38 మందికి 13 మంది మాత్రమే హాజరవ్వడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల నిర్వాహకులు హెచ్ఎం గుణ ప్రకాష్, వీఆర్వో శివరాం ప్రకటించారు. అలాగే ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లో చైర్మన్ పదవి కోసం సయోధ్య కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. ఇకపోతే జీఏ కొట్టాలలో ఏకగ్రీవంగా చైర్మన్, వైఎస్ చైర్మన్‌ను ఎన్నుకున్నట్లు ఎంఈఓ జయానాయక్ తెలిపారు. ఇదిఇలా ఉంటే మండలంలోని నీలూరు సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాల్లో విద్యార్థులు లేనందున ఎన్నికలు నిర్వహించలేదన్నారు.

నార్పలలో వాయిదా

నార్పల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక, బాలుర పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ నెల 8న పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు జరగాల్సి ఉండగా వాయిదా పడ్డాయి. మళ్లీ శనివారం ఎన్నికలు నిర్వహించేదుకు ప్రయత్నించగా.. తల్లిదండ్రులు అధిక సంఖ్యలో రావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో కాకుండా ,పరోక్ష పద్ధతిలో నిర్వహించాలని తల్లిదండ్రులు కోరడంతో ఉపాధ్యాయులు పాఠశాల ఎన్నిక వాయిదా వేశారు.

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లుటౌన్: ఇంటింటా ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.రమాదేవి, ఎన్నికల డీటీ ఆదినారాయణ సూచించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఇంటింటా ఓటరు సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులతో పాటు ఇప్పటి వరకు ఓటు హక్కు పొందని వారికి సంబంధించిన ధ్రువీకరణపత్రాలు సేకరించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలంగిపు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ అబ్దుల్‌సత్తార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా జిహేశ్వర్ మహరాజ్ జయంతి



జిహేశ్వర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: స్వకుల సాలి సమాజం ఆధ్వర్యంలో శనివారం జిహేశ్వర్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్లూరు రోడ్డులోని స్థానిక అంభాభవానీ ఆలయం నుంచి జిహేశ్వర్ మహరాజ్ చిత్రపటాన్ని ఊరేగించారు. ఊరేగింపులో స్వకుల సాలి కులస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలోని అంభా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పదోతరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వకుల సాలి సమాజం రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లె నగేష్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిందే సురేష్, మహిళ మండలి అధ్యక్షురాలు వాణి, శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండలంలోని రాచేపల్లి ఎంపీటీసీ సునీత భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు(40) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మృతి చెందారు. శనివారం సొంతూరు నిదనవాడ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నిదనవాడలో బాగా పని చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. చిన్న వయస్సులో అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అంతకుముందు రామాంజనేయులు మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, బొమ్మన శ్రీరామిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులను సిద్ధం చేయండి

పామిడి: మండలంలో త్వరలో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు సంబంధించి భూపరమైన రికార్డులను సిద్ధం చేయాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించిన రికార్డులపై ఆయన అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, సర్వేయర్ మురళీధర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

34 మందిపై కేసు

యాడికి: మూడు రోజుల క్రితం మండలంలోని బోయరెడ్డిపల్లెలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఇరువర్గాలపై 34 మందిపై కేసనమోదైంది. శనివారం వైఎస్సార్‌సీపీకి చెందిన 14 మందిని అరెస్టు చేసి ఉరవకొండ కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు వంక నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప శనివారం తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



తాడిపత్రిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు



గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బీకేఎస్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఆర్డీటీ సిబ్బంది

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు/శింగనమల/పుట్లూరు/పెద్దపప్పూరు/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు డిమాండ్ చేశారు. ఇటీవల కోల్‌కతాలో వైద్య కళాశాలలో పీజీ మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం తాడిపత్రి పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి మహాత్మాగాంధీ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజాకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వన్ రాజు మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యుడు వైఎస్ థామస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి , ప్రైవేటు వైద్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, రామకేశవరెడ్డి, సుధాకర్, సుధీర్, ప్రదీప్, ఇమ్మానియేల్, త్రిలోచనరెడ్డి, వద్ది శ్రీనివాసులు, ప్రభుత్వ వైద్యులు ఎస్దాన్, భగీరథ, మంజుల, మధులత, సతీష్, సాయిచరణ్, రోటరీక్లబ్ సభ్యులు, మెడికల్ షాపు యజమానులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో వైద్యులు శనివారం చేపట్టిన నిరసన ర్యాలీకి పలు రాజకీయ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఇండియన్ అసోసియేషన్ గుంతకల్లు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కీర్తికిరణ్‌రెడ్డి, డాక్టర్ జిలాన్, కోశాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు కమలమ్మ, సరోజమ్మ, శ్రీనివాసులుగుప్తా, బాలాజీ, వెంకట్యేర్లు, హిమబిందు, వేల్పారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆది శివ సద్గురు ఆయూష్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ విద్యార్థులు, డాక్టర్ల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే శింగనమల, పుట్లూరు, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో వైద్యులు నిరసన ర్యాలీలు నిర్వహించారు.